# పెళ్ళేన వచ్చేసిందే బాల!



మేము పూణెకి వెళ్ళిన కొత్తల్లో ఒక తెలుగు కుటుంబంతో చాలా సన్నిహితంగా వుండే వాళ్ళం. ఆయన పేరు డా॥రమణరావు. మా లాబ్‌లో మా కన్నా చాలా సీనియరు. కానీ మా ఆయనకి ఛెస్ ఆటలో మంచి స్నేహితులు. వాళ్ళిద్దరూ శనాదివారాలు వస్తే మా ఇంట్లోనో, వాళ్ళింట్లోనో కూచుని రోజంతా ఆడుకుంటూ వుండేవారు. ఇంట్లో ఎవరైనా ఛెస్ ఆడే వాళ్ళుంటే అందరికీ నిశ్శబ్దంగా వుండడం అలవాటయిపోతుంది. అందుకేనేమో వాళ్ళ పిల్లలు పద్మ, రాధ, రవి అస్సలు అల్లరి చేసేవాళ్ళు కాదు. ఆ తరువాత కొద్దికాలానికే ఆయనకి వరంగల్ ఆర్.ఇ.సి.లో ప్రొఫెసర్‌గా వుద్యోగం రావడంతో వరంగల్ వెళ్ళిపోయారు. ఎన్నో సంవత్సరాలు

గడిచాక మేము మళ్ళీ హైదరాబాదులో కలిసి మా స్నేహాన్ని పునరుద్ధరించుకున్నాం. వరంగల్ నుంచి ఏవైనా పన్ల మీద వస్తే మమ్మల్ని కలవకుండా వెళ్ళేవారు కాదు. స్వతహాగా వాళ్ళది చాలా సంపన్న కుటుంబం. కానీ మాటతీరులో గానీ, ఆలోచనల్లో గానీ, పద్ధతులలో గానీ ఏ హొళ్ళూ, పెళ్ళూ వుండేదికాదు. నిమ్మకు నీరెత్తినట్లుగా నిశ్శబ్దంగా వుండేవారు. వాళ్ళ పెద్దమ్మాయి అత్తవారిల్లు జూబిలీహిల్స్. తను ఎలక్ట్రానిక్స్ ఇంజనీరు. ఇంక రెండవ అమ్మాయి రాధ కెమికల్ ఇంజనీరింగులో డాక్టరేటు కోసం ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేసేది. అక్కడే హాస్టల్‌లో వుండేది. అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయేది.

ఆవేళ సోమవారం మా ఫాక్టరీకి సెలవు కాబట్టి మేమిద్దరం ఇంట్లోనే వున్నాము. పిల్లలు స్కూళ్ళకీ కాలేజీలకి వెళ్ళిపోయారు. నేను ఏదో పనిమీద హాల్లోకి వచ్చేటప్పటికి రాధ ఏదో పుస్తకం చదువుకుంటూ కనిపించింది. ఆ అమ్మాయి అంతే. మసిలేటప్పుడు చిన్న చప్పుడు కూడా చేయదు. “ఏం రాధా! ఈవేళ మా ఇంటి మీద గాలి మళ్ళింది. ఈవేళ మీకు సెలవా?” అని పలకరించాను.

“రిసెర్చి వాళ్ళకి సెలవేముంటుందాంటీ? వూరికే వచ్చాను. అమ్మకి వంట్లో బాగుండడం లేదని వరంగల్ వెళ్ళాను. మీ ఇంటికి అస్సలు వెళ్ళలేదా అని కోప్పడింది” అని చెప్పింది.

“అవునూ! ఇప్పుడెలా వుంది? చాలా అవస్థ పడిపోతోంది. ఆపరేషన్ చేయిస్తేనే మంచిది. ఎన్నాళ్ళు బాధపడుతుంది? మీ నాన్నగారికేమో అక్కర్లేని భయాలు!”

“లేదాంటి ..... ఇప్పుడు ఒప్పుకున్నారు. ఆగస్టు మొదటి వారంలో చేస్తారుట. అప్పుడు మళ్ళీ వెళ్తాను. ప్రస్తుతం అక్క అమ్మదగ్గిరే వుంది” అని చెప్పింది.

ఈలోగా వంటలయ్యాయి. భోజనానికి రమ్మంటే వచ్చి మామూలుగా భోజనం చేసి మళ్ళీ హాలులో కూచుని ఏదో మాగజైన్ చదువుకోడం మొదలు పెట్టింది.

ఇదేవిటబ్బా ఈ పిల్ల! ఎప్పుడూ ఇంత స్థిమితంగా మా ఇంట్లో తను కూర్చున్న గుర్తు లేదు! మళ్ళీ ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం. కాసేపు గార్డెన్లో వుయ్యాలూగి మళ్ళీ వచ్చి హాలులో కూచుని అదే మాగజైన్ కంఠతా పట్టడం ప్రారంభించింది. ఏదన్నా పనిమీద వచ్చిందేమో! అడగడానికి మొహమాట పడతోందేమో! పెద్దదాన్ని కదా నేనే అడిగితే సరిపోతుందని సంభాషణ మొదలు పెట్టాను.

“ఇంకా ఏవిటి విశేషాలు? నీ రిసెర్చి ఎలాసాగుతోంది? ఇంకా ఎన్నాళ్ళు పడుతుందిట?” అనడిగాను. “బాగానే సాగుతోందాంటీ. అన్ని బాగుంటే రెండేళ్ళలో

సబ్మిట్ చేయచ్చు. రిజల్ట్స్ కూడా బాగానే వస్తున్నాయి. కానీ మా సీనియర్, నాకు హెల్ప్ చేసే అతను ఆగస్టు చివరకి అమెరికా వెళ్ళిపోతున్నాడు. అతనికి పోస్ట్‌డాక్‌గా నార్త్ కరోలీనాలో వచ్చింది. అదే ఇపుడు నాకు సమస్య" అంది.

"ఇందులో పెద్ద సమస్య ఏముంటుంది? మీ ప్రొఫెసరుగారు వేరే ఎవరినయినా ఇస్తారేమో" అన్నా.

"లేదు! ఈ టాపిక్ మీద మేమిద్దరమే వున్నాం. అతని పిహెచ్.డి. ఇందులోనే వచ్చింది".

"అయితే మరీ మంచిది. నీ డిగ్రీ వచ్చేటప్పటికి నువ్వు కూడా అమెరికా వెళ్ళేందుకు సాయంచేస్తాడు".

"అదే నేనూ చెప్పానాంటీ నాన్నకి! కానీ నన్ను చాలా కోప్పడ్డారు" తల వంచుకు చెప్పింది. రెండు నీటిబొట్లు పడ్డాయి. అతనెవరో అమెరికా వెడుతుంటే వీళ్ళ నాన్న తననెందుకూ కేకలేయడం! తుంటి మీద కొడితే పళ్ళురాలినట్లు ... దీని తప్పేవుంది? ఎక్కడుందీ మెలిక! రెండు నిమిషాలాగాక అప్పుడు లైటు బల్బు వెలిగింది. లాభంలేదు! నా స్విచ్‌లన్నీ తుప్పుపట్టిపోతున్నాయి. కాస్త సద్దుకు కూచుని పని మొదలుపెట్టాను. "అతనంటే నీకు ఇష్టమా?" అనడిగాను.

"ఇష్టమని ఏం కాదు గానీ పాపం చాలా మంచివాడాంటీ! నేను నాలుగేళ్ళనుంచీ చూస్తున్నాను. అందరితోటీ ఎంతో మర్యాదగా వుంటాడు. వాళ్ళ నాన్నగారు అతన్ని పెళ్ళిచేసుకుని వెళ్ళమంటున్నారు. ఎక్కువ టైము లేదు. నాన్న బాగా కోప్పడ్డారు".

"ఎందుకు కోప్పడ్డం!"

"ఇప్పుడమ్మకెంతజబ్బుగా వుందీ! ఆపరేషనని నేను ఎంత ఖంగారు పడుతున్నాను? అసలిలాటప్పుడు నీకు పెళ్ళి ఆలోచన ఎలా వచ్చిందీ! మతుండే మాట్లాడుతున్నావా? ఏడాది వరకూ ఏమీ మాట్లాడకు' అని కోప్పడితే భయపడి పారిపోయి వచ్చేశా" అని బావురుమంది. అమ్మయ్య! ఇప్పటికి క్లారిటీ వస్తోంది.

"అసలు నాన్నగారికెందుకంత భయం! ఈ మధ్య ఆపరేషన్లు చాలా తేలికయిపోయాయి. ఇంతకీ అతనెప్పుడు వెళ్ళాలి?"

"సెప్టెంబరు ఫస్టుకల్లా తను అక్కడుండాలి. అప్పుడే జూలై అయిపోతోంది. అమ్మ ఆపరేషను ఆగస్టు ఒకటిన. అమ్మ ఆపరేషనయి కోలుకునేసరికి ఆ అబ్బాయికి వాళ్ళనాన్నగారు ఎవరో ఒక అమ్మాయిని చూసి పెళ్ళి చేసేస్తారు. ఆయన ఇదే

పనిమీదున్నారుట” అంది.

“బ్రాహ్మలేనా?” అనడిగాను.

“మనవాళ్ళే ఆంటీ! నేను నల్లకుంటలో ఒక పంతులుగారికి మా జాతకాలు కూడా చూపించాను. కుదిరాయన్నారు.”

“మరింకనేం. మీ నాన్నగారికున్న నమ్మకాలు నాకు తెలుసుకదా! నన్ను మాట్లాడమంటావా? ఇంతకీ ఆ అబ్బాయికిష్టమేనా?”

“చూస్తారా ఆంటీ! నేను ఫోను చేస్తే అరగంటలో వచ్చేస్తాడు. వెయిట్ చేస్తున్నాడు”. అంటూ హాస్టల్‌కి ఫోను చేసింది.

అరగంటలో మోటార్ సైకిల్ మీద వచ్చాడతను. తెల్లగా పొడుగ్గా సమానంగా చాలా చక్కగా వున్నాడు. కన్యావరయతేరూపం అని పెద్దలూరికే చెప్పలేదుగా. వాళ్ళ నాన్నగారు తణుకులో వుంటారుట. ఆయన గవర్నమెంటులో పనిచేసి రిటైరయి పదేళ్ళపైనే అయిందిట. తల్లి పోయి రెండేళ్ళయింది. వీళ్ళు అయిదుగురు అన్నదమ్ములు. మూడో అబ్బాయి ఇంట్లో ఆయన వుంటున్నారు. ఈ అబ్బాయి ఆఖరివాడు. అతని పెళ్ళి చూడాలని ఆయన కోరిక. తనకీ వయసయిపోయిందని అందువల్ల పిల్లవాడ్ని పెళ్ళి చేసుకోకుండా అమెరికా వెళ్ళద్దని గట్టి పట్టుపడుతున్నారు. తండ్రి మాటకి ఎదురు చెప్పే అలవాటు ఇతనికి వున్నట్లు కనపడలేదు. అయినా గోత్రాలు కలవలేదు. జాతకాలు కలిశాయి. ఇంకేవిటి అభ్యంతరం? వాళ్ళిద్దరూ ఇష్టపడుతున్నారు. సాయం చేయడం మన ధర్మం కదా! ఇంకా వాళ్ళు పద్ధతిగా పెరిగిన పిల్లలు కాబట్టి మనల్ని బతిమిలాడుతున్నారు. అసలు ఆ పెళ్ళేదో చేసేసుకుని వస్తే ఏం చేస్తాం! అతని దగ్గిర వాళ్ళ నాన్నగారి ఎడ్రసు, ఫోన్ నంబరు తీసుకున్నాక అతను వెళ్ళిపోయాడు. రాధని ఆ పూటకి వుండిపొమ్మన్నాను.

రమణరావుగారితో మాట్లాడాలంటే నాకూ కొంచెం బెరుకే. ఎంతైనా మాకన్నా బాగా సీనియరుకదా! కానీ మా ఆయనకి మాత్రం చాలా చనువు ఆయన దగ్గర. ఈయన మాటంటే ఆయనకీ మంచి గౌరవమే. మా ఆయనకి ఏదైనా విషయం అర్థం అవడానికి కొంచెం టైము పడుతుందిగానీ, ఆ తరువాత ఆయన ఏం చెయ్యాలో ఎవరమూ చెప్పక్కర్లేదు. అందులో ఇలా పిల్లలు ఏమైనా సాయం కోరినపుడు వెనకాడే ప్రశ్నేలేదు. నేను కాస్త ఓపిగ్గా మా ఆయనకి విషయం వివరంగా చెప్పాను. తను మాట్లాడితే బాగుంటుందని అన్నాను. ఆయన వరంగల్ రమణరావుగారికి ఫోను చేశారు. కుశలప్రశ్నలయ్యాక “కుర్రాడు బాగున్నాడండీ! ఇందాక మా ఇంటికి వస్తే

మాట్లాడాను. చాలా బుద్ధిమంతుడిలా వున్నాడు" అన్నారు.

"ఆ దెయ్యం మీ ఇంటికి వచ్చిందా?" అని అడిగి రెండు నిమిషాలపాటు వాళ్ళేపరిస్థితుల్లో ఉన్నారో చెప్పారుట. నిజమే కానీ ఇలాటి అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావనీ, అలాటి సంబంధం కుదరడానికి బోల్టు శ్రమపడవలసి వస్తుందని చెప్పి నెమ్మదిగా ఆయనని శాంతపరిచారు. చివరకి మేమిద్దరం బాధ్యత తీసుకుంటే తన కభ్యంతరం లేదని ఆయన అన్నారు. వ్యవహారం ఎలా సెటిలయిందంటే మా ఆయనే తణుకు వెళ్ళి పెళ్ళికొడుకు తండ్రితో మాట్లాడేటట్లు, తాంబూలాలు పుచ్చుకునేటట్లు, ముహూర్తాలు పెట్టించడం, పెళ్ళి ఏర్పాట్లు చేయడం అన్నీ మేమే చేసేటట్లు, వాళ్ళు ఆ రోజున వచ్చి పీటల మీద కూచునేట్లు! అసలు మేం వాళ్ళని అలా ఎలా వప్పించామో, వాళ్ళు ఎలా వప్పుకున్నారో వాళ్ళకి మా మీద అంత నమ్మకమేమిటో తల్చుకుంటే ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగా వుంటుంది. అట్లాంటి సంఘటనలు, స్నేహాలు ఇప్పుడు మనం కలలో కూడా వూహించుకోలేం.

మర్నాడు రాత్రి బస్సులో మా వారూ, ఆ పెళ్ళికొడుకూ కలిసి తణుకు వెళ్ళారు. కూడా పెళ్ళికూతురి ఫోటోలు, జాతకాలు, కుటుంబ వివరాలు, ప్రవరలూ అన్నీ రాసుకుని మరీ వెళ్ళారు. అక్కడ వాళ్ళ నాన్నగారు, అన్నయ్య పరమానందభరితులై మా ఆయనకి రాచమర్యాదలు చేశారుట. ఆయన వంటవాళ్ళని పెట్టి కందబచ్చలి, రవ్వపోళీలు చేయించారుట. సాయంత్రం మళ్ళీ లడ్డూ, బూందీతో మర్యాదలు చేసి ఈయనకి బట్టలు పెట్టి సాగనంపారు. ఆ వూళ్ళో ఒక పదిమందిని భోజనానికి పిలిచారుట. మా వారిని మేనమామగా పరిచయం చేసారు. మళ్ళీ తెల్లవారేటప్పటికి మా ఆయన ఇంటికి వచ్చేసి నాకు బాధ్యత అప్పచెప్పేశారు. పెళ్ళి మన దేశానికి నలభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవం – ఇద్దరూ స్వాతంత్ర్యాన్ని వదులుకోబోతున్నారు. వుదయం 11 గంటల 10 నిమిషలకి ముహూర్తం పెట్టించుకుని మరీ వచ్చారు. ఇంక రాధ వాళ్ళ అమ్మకి ఆపరేషన్ చేయించేందుకు ఎంతో సంతోషంగా వాళ్ళ వూరు వెళ్ళిపోయింది.

ఇక్కడ నాకు పెళ్ళి పనులు మొదలయ్యాయి. ఈ పెళ్ళిలో నాతోబాటు మా ఆయన కూడా కలిసి రావడంతో నా సంతోషానికి పట్టపగ్గాల్లేవు. డబల్ వుత్సాహం మరి. రమణరావుగారు రెండురోజుల తర్వాత వచ్చి నా చేతిలో లక్షరూపాయలు పెట్టారు. అవసరం అయితే మళ్ళీ పంపుతానని, దేనికీ నేను కష్టపడకుండా ఏర్పాట్లు చేయమని చెప్పారు.

అప్పట్లో మా ఇంట్లో పర్మనెంటు వంటావిడ లేదు. అందువల్ల ఒక వారం

ముందు నుంచి వంటావిడని పంపిస్తానని, మూడువందలమందికి పెళ్ళి భోజనం, ముందురోజు, మర్నాడు సాయంత్రాలు వందేసిమందికి వంట చేస్తానని సత్యంగారు అంగీకరించి కావల్సిన సరుకుల లిస్టు రాసి ఇచ్చారు. సారె పిండివంటలకి కావల్సిన వస్తువులు వేరే వంటాయన వచ్చి ఇంకో లిస్టు ఇచ్చాడు. ఆ లిస్టులు మా కిరాణా కొట్టుకి పంపిస్తే గంటలో అన్నీ అట్టడబ్బాలలో పెట్టి పంపడమే కాక ఫోను చేసి "అమ్మగారూ! అప్పుడే పాపమ్మకి పెళ్ళి చేసేస్తున్నారా? చదువయిందా? ఏ వూరి పిల్లవాడు?" అంటూ కుశలం కనుక్కున్నాడు ఆ కొట్టు యజమాని రతన్‌లాల్ సోనీ. మనకి బట్టల కొట్టు, కిరాణాకొట్టుతోను వాళ్ళకి మనతోను ఒక అనుబంధం వుండేది. కానీ మన జీవితాలలోంచి ఇంటి పురోహితుడు, డాక్టరు, చాకలి, టైలరులాంటి వాళ్ళు వెళ్ళిపోతున్నట్లే కిరాణాకొట్లు కూడా వెళ్ళిపోతున్నాయి. ఎంత పెద్ద దుకాణాలయినా డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌తోటీ, మాల్సుతోటీ పోటీ తట్టుకోలేక మాయమయిపోతున్నాయి. ఒక పద్ధతిగా నెలకొకసారి సరుకులు తెప్పించుకుని వాడుకునే అలవాటు యువతరంలో తగ్గిపోతోంది. అమెరికాలో లాగా శనాదివారాలలో పెద్ద పెద్ద స్టోర్సుకి వెళ్ళి కావల్సినవి నాలుగూ, సరదాకి నాలుగూ, అవసరం పడితే ఎప్పుడన్నా పనికొచ్చేవి నాలుగూ కొని అక్కడ భోజనాలు చేసి, సినిమా చూసి సాయంత్రం డిన్నరుకోసం ఇంకో పిజ్జాకొనుక్కుని ఇల్లు చేరతారు. ఇంతసొమ్ము ఖర్చు అయినా ఒక నలుగురు ఇంటికి భోజనానికి వస్తే పాలో, పెరుగో, కూరలో నూనో, నెయ్యో ఒక్కొక్కప్పుడు బియ్యమో తెచ్చేందుకు యజమాని స్టోర్సుకెళ్ళాల్సిందే. మా అమ్మమ్మగానీ, అమ్మగానీ అత్తగారు కానీ, నేను కానీ ఎప్పుడూ అలా చేసిన గుర్తులేదు. అన్నిటికన్నా వంటింట్లో కొట్టుగది చాలా స్ట్రాంగ్‌గా వుండేది. ఆ రోజుల్లో ఎవరికీ ఇంతింత సంపాదనలుండేవి కాదుకదా! చుట్టాల తాకిడి కూడా బాగానే వుండేది. అందువల్ల ఇంటి ఇల్లాలి ఆర్థిక ప్రణాళికలో వెచ్చాలు, వాటిని సరఫరాచేసే కిరాణా యజమాని ముఖ్యపాత్ర పోషించేవారు. డబ్బాలలో పెళ్ళి సరుకులు వచ్చి హాలులో తిష్టవేయగానే మా ఇంటికి పెళ్ళికళ వచ్చేసింది.

బట్టలు, పట్టుచీరలు, నగలు అన్నీ వాళ్ళు వరంగల్‌లో కొనుక్కుంటామని చెప్పి నా నెత్తిన పాలు పోసారు. నేను మధుపర్కాలు, తెరసెల్లా, కొన్ని ధోవతులు లాంటివి కొంటే నా షాపింగు పని అయిపోతుందని రికామీగా వున్నాను. కానీ నాతో ఏ వ్యవహారమూ అలా తెమలదుకదా! ఏదో మెలిక తప్పదుమరి. పెళ్ళి వారంరోజులుండనగా తనకి చేయవలసిన షాపింగు తణుకులో కుదరదనీ హైదరాబాదు నాలుగురోజులు ముందు వచ్చి నా సాయంతో షాపింగు పూర్తి చేసుకుంటాననీ కాబోయే వియ్యంకుడు గారు ఫోనులో చెప్పారు. తప్పకుండా రమ్మని

చెప్పాం. మర్నాడు పొద్దున్నే ఆయన కొన్ని శుభలేఖలతో సహా బస్సుదిగారు. వాళ్ళకి బంధువులు హైదరాబాదులో చాలామందే వున్నారు మరి. వాళ్ళని ఆహ్వానించే పనికూడా పెట్టుకునే వచ్చారు. ఆయనకి మన పెళ్ళికొడుకు కన్నా పెద్దవాళ్ళు నలుగురు కొడుకులున్నారు. నలుగురు కోడళ్ళు, ఆరుగురు మనవరాళ్ళు, ముగ్గురు మనవలు. ఈయన కుటుంబం కాకుండా ఇద్దరు బావమరుదులు, వాళ్ళ భార్యలు. ఇది తను చేయబోయే ఆఖరి శుభకార్యం కాబట్టి అందరికీ మంచి బట్టలు పెట్టాలని, అదీ సర్ప్రైజ్‌గా వుండాలని ఆయన కోరిక. కోడళ్ళంటే వల్లమాలిన అభిమానం ఆయనకి. అన్నట్లు ఆరుగురు మనవరాళ్ళలో ఒకమ్మాయికి తన భార్యపేరు పెట్టారు కాబట్టి ఇంకో డ్రెస్సు ఎక్కువ కొనాలి. ఒక్కొక్క చీర ఏ రేంజ్‌లో వుండాలో కూడా చెప్పారు. పదింటికల్లా కమ్మగా భోంచేసి బయల్దేరి సాయంత్రానికల్లా ఆయన తెచ్చుకున్న డబ్బులన్నీ అవగొట్టించేసి ఇల్లు చేర్చాను. డబ్బులు ఖర్చు పెట్టడంలో నాతో ఎవ్వరూ పోటీకి రాలేరు. పదిలక్షలిచ్చినా పదిగంటల్లో దారి చూపించగలను. ఇంటికి వచ్చాక పెద్దపెద్ద కవర్లలో ఎవరివి వాళ్ళకి పెట్టి, ఖర్జూరాలు, పసుపు కుంకుమ పాకెట్లతో సహా నీట్‌గా పాక్ చేసి పైన పేర్లు రాసి ఆయనకప్పచెప్పాను. నాకు కూతుళ్ళు లేని లోటు తీర్చావమ్మా అని ఎంతో సంతోషించారు. అన్నట్లు ఆయన తన పిల్లలతోబాటు మా కుటుంబానికి కూడా బట్టలు కొన్నారు.

పెళ్ళి జరిగేది మా ఇంట్లోనే అని కార్డుల్లో వేశాం గానీ తీరా వానాకాలం కదా! జాగా సరిపోదేమోనని అనుమానం వచ్చింది. అప్పటికి మా ఇంటి ఎదురు స్థలం ఖాళీగానే వుంది. మూడు పక్కలా మంచి కాంపౌండు గోడలు, ఇళ్ళు వుండి మనం వాడుకోవడానికి అంతా అనువుగా వుంది. వాళ్ళ స్థలంలో పందిరేసి పెళ్ళి చేస్తామని కబురు చేస్తే ఆ స్థలం యజమాని చాలా సంతోషంగా వప్పుకున్నారు.

ఒక లారీడు ఇసుక తెప్పించి నేల చదును చేసి, వానకాగే మిలటరీ టార్పాలిన్ తెప్పించి మంచి స్ట్రాంగ్ పందిరి వేయించాం. నేలమీద జంపఖానాలు పరచి చిన్న స్టేజి వేశాక రెండువందల కుర్చీలు పట్టాయి. ఆ స్థలానికి, మా ఇంటికి మధ్యలో వున్న రోడ్డునటూ ఇటూ మూసేసి పైన పందిరి వేసి భోజనాల హాలులాగా తయారు చేశాం. అప్పటికింకా బఫే భోజనాలు లేవు. రెండువరుసలు బల్లలు కుర్చీలు వేసి రెండు బాచ్‌లలో అందరి భోజనాలు అయేటట్లుగా రెడీ పెట్టాము. కన్యాదాతలు ఒక పెద్ద వాన్‌లో తోడుగా ఒక నర్సుని వెంట పెట్టుకుని పెళ్ళి ముందురోజు మా ఇంటికి చేరారు. పెళ్ళికూతుర్ని చేసేటప్పుడు తోడ పెళ్ళికూతురెవరా అని ఆలోచన వచ్చింది. అది కూడా మా ఇంటి ఆడపడుచే, అదే మా అమ్మాయి కూచుని తన

వంతు పాత్ర నిర్వహించింది. తోడపెళ్ళికూతురైతే త్వరగా పెళ్ళయిపోతుందని మా చిన్నప్పుడు ఆశపెట్టేవారు. కానీ మా అమ్మాయి విషయంలో నిజంగానే జరిగింది. ఈ పెళ్ళయిన సరిగ్గా ఏడాదికి దాని పెళ్ళి కూడా అయింది.

అమ్మయ్య చాలా వరకు పనులన్ని అయ్యాయి. పెళ్ళి వారికి, మా వీధిలోనే వున్న ఇంట్లో నాలుగు గదులు విడిది ఇచ్చాం. అందరూ అనుకున్న సమయానికి చేరారు. కానీ ఏం లాభం! తెల్లవార్లూ కుండపోత వర్షం. తెల్లవారేటప్పటికి కుర్చీలు, బల్లలు అన్నీ నాని ముద్దయి వున్నాయి. నలుగురు కూలీల్ని పెట్టించి అన్నీ తుడిపించి మళ్ళీ సద్దేటప్పటికి సూర్యభగవానుడు తళతళలాడుతూ ప్రత్యక్షమయ్యాడు. తెల్లవార్లూ వానలో నానిన మామిడాకులన్నీ తలంట్లు పోసుకున్న అమ్మాయిల్లాగా సూర్యకిరణాల్లో మెరవడం మొదలెట్టాయి. తొమ్మిదయేటప్పటికి బంధువుల రాక మొదలయింది. ఈ లోపల మా హాల్లోనే స్నాతకం పూర్తయింది. వెంటనే పెళ్ళిపీటల మీద కూర్చున్నారు. ఒక్క చినుకు కూడా పడకండా లక్షణంగా శోభాయమానంగా పెళ్ళి అయింది. రెండు బాచ్‌లలో చాలా మటుకు అందరి భోజనాలు కూడా అయ్యాయి. ఒక పాతికమంది ఆడ పెళ్ళివారం మిగిలాం. ఇంకా హెూమాలవలేదు కాబట్టి వధూవరులకి టిఫిన్లు పెట్టి ఐస్‌క్రీం తినిపించాం. మేం కూడా భోజనాలు కానిస్తే హెూమాలు అప్పగింతలు పూర్తి చేసి పెళ్ళివారిని సాగనంపచ్చు అని లేవబోతున్నాం. మళ్ళీ మొదలైంది వాన. సన్న తుప్పరగా మొదలై ఆగకుండా కురుస్తూనే వుంది. దాంతో వంటలన్నీ మా వంటింట్లోకి చేరాయి. అందరం మనవాళ్ళమే కాబట్టి నిలబడో కూచునో భోజనాలు అయ్యాయనిపించాం. పోర్టికోలోనే హెూమాలు, అప్పగింతలు పూర్తయ్యాయి. నేనింత కష్టపడ్డా నన్నేదో ఆట పట్టిస్తేగానీ మా వాళ్ళకి తృప్తిగా వుండదు. సుశీల తన పతివ్రతా మహాత్మ్యంతో వరుణదేవుణ్ణి ఆపి మరీ పెళ్ళి చేయించేసింది అని నా మీద జోకులేశారు.

సాయంత్రం ఆరుగంటలయేసరికి మగపెళ్ళివారు మిగిలిన బూరెలు, పులిహెూర పాక్ చేయించుకుని, పెళ్ళి కూతుర్ని, ఆవిడ అక్కని వెంట తీసుకుని స్టేషన్‌కెళ్ళిపోయారు. మా ఫ్రెండుగారి కుటుంబమంతా వాన్‌లోనూ, ఇంకో కారులోనూ బయలుదేరి వరంగల్ వెళ్ళారు. అప్పటికే ఆవిడకి కొంచెం స్ట్రెయిన్ అయింది. మర్నాడు పొద్దున్నే ఇంకో పెళ్ళి వుందని చెప్పి టెంట్ వేసేవాడు కుర్చీలు, బల్లలు, టెంట్లు, జంపఖానాలు, గిన్నెలతో సహా పూచిక పుల్ల మిగల్చకుండా తీసుకుపోయాడు. రాత్రి ఎనిమిదయేటప్పటికి అక్కడ అంత పెద్ద శుభకార్యం జరిగిన ఆనవాళ్ళు కూడా లేవు. అంతా మాయాబజారు సినిమా. ఆనవాయితీ తప్పకుండా

మా అత్తగారు వేడిగా అన్నం, బెండకాయ కూర, దోసకాయ పచ్చడి, చారు చేసి కొడుక్కి భోజనం పెట్టారు. అదీ మా సోమరాజు వాళ్ళ గొప్ప. ఎన్ని ఆధరువులున్నా మా ఆయనకి ఏపూటదాపూట వండాల్సిందే! తల్లి వున్నన్నాళ్ళూ అలాగే జరిగింది మరి.

మా అమ్మ కొంచెం పైకి అననే అంది. "అమ్మా! ఇంకో అమ్మ కన్న పిల్లకి అంత ధైర్యం చేసి ఇన్ని ఏర్పాట్లు చేశావు? ఏదైనా తేడా వస్తే లోకం నిన్ననదా?" అని. మా అత్తగారు "ఏం ఫరవాలేదు వదినగారూ! తలపెట్టిన పని మంచిదయితే దేవుడెప్పుడూ కూడానే వుంటాడ"ని అమ్మకి ధైర్యం చెప్పారు. అలా పెళ్ళి చేసుకున్న ఆ జంట సంతోషంగా పిల్లాపాపలతో అమెరికానేల్తూ మాకు ఇంకా ఎన్నో మంచి పనులు చేసేందుకు కావల్సిన ఉత్సాహాన్నిస్తున్నారు.

✤